

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 11 ఏప్రిల్, 2015 సంచిక : 11

**గౌరవ సంపాదకత్వం**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech

**సాయివాణి చందా వివరాలు**

వార్షిక చందా .......... రూ॥ 80/-

ఆజీవ సభ్యత్వం .......... రూ॥ 800/-

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126.

**Ph : 9440413455, 9848133565**

Website : www.saidhamam.org

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .......... 2

దశనామ్ని .......... 5

గజానన విజయం .......... 8

షిరిడీ డైరీ .......... 10

స్వరాంజలి .......... 12

శుకవాణి .......... 13

మాతృసంస్థ కబుర్లు .......... 14

అనుభవాలు-అనుభూతులు .......... 19

భలే మంచి దొర దొరికె .......... 26

దేవు(డితో కాస్సేపు .......... 27

ఆశీరక్షతలు .......... 28

మిగిలిన కాస్త సమయం .......... 29

నాలుగు మెట్లు .......... 29


గురు జన్మదిన దక్షిణ .......... 32







# మా వాణి



ఏప్రిల్ నెలలో వస్తున్న (4వ తేదీ) శుభదినం హనుమజ్జయంతి. హనుమంతునికీ, రామాయణానికీ ఎంతటి సంబంధం ఉన్నదో చెప్పే ఐతిహ్యం ఒకటున్నది. హనుమంతుడు రామకథను రచించాడు. (దానికి హనుమద్రామాయణం అని పేరుట) హనుమ తన గ్రంథం తీసుకువెళ్లి శ్రీరాముని చేతిలో పెట్టాడు. రాముడు దాన్ని ఓసారి అలవోకగా చూచి సరయూ నదిలోకి విసిరేసాడట. లక్ష్మణుడు ఆశ్చర్యంగా అడిగాడు- ఎందుకలా చేసావని. రాముడు చిన్నగా నవ్వి యిలా అన్నాడట "రామాయణంలో హనుమ పాత్ర ఎంతో ముఖ్యమైనదీ, ఉదాత్తమైనదీను. అతడే వ్రాసిన రామాయణంలో తన కథ తాను ఘనంగా చెప్పకోడు గదా! హనుమ లేని రామాయణం ఏమిటయ్యా! అందుకే పారేసాను". అంత అప్పుడు రామునికి హనుమ. ఎక్కడో కిష్కింధలో శాఖామృగమైన ఒక కోతికి అంతటి స్థాయి ఎలా వచ్చింది?

హనుమ అంజనాదేవికి వాయుప్రసాదంగా జన్మించాడు. మహాబలశాలిగా ఎదిగాడు. అనేకానేక వరాలు దేవతల ద్వారా పొంది, అజేయమైన పరాక్రమశాలిగా రూపొందాడు. మరి హనుమ కన్నా బలపరాక్రమశాలురు, వరప్రసాదితులు ఎందరో ఉండగా యీయనకే ఎందుకు విలువ వచ్చింది? యుద్ధకాండలో ఒకచోట-సైన్యమంతా స్పృహతప్పింది. అంతలో జాంబవంతుడు స్పృహలోకి వచ్చి "ఆంజనేయుడున్నాడా?" అని అడిగాడు. అదేమంటే 'అతడొక్కడుంటే మనం యుద్ధం గెలిచినట్లే-అతడొక్కడు కూలిపోతే అందరం కుప్పగూలినట్లే' అన్నాడు. అంత విశ్వాసాన్ని తన వారి దగ్గర ఎలా పొందగలిగాడు హనుమ? అతని బలం కేవలం శారీరికం కాదు-నైతికం, బౌద్ధికం కూడా గనుక. హనుమంతుడు సూర్య భగవానుని

దగ్గర-ఆ వేడిని, ఆయనలోని తీక్ష్ణతను సహించి మరీ విద్యా భ్యాసం చేసాడు. గొప్ప వ్యాకరణ వేత్తగా పేరు పొందాడు. ఆయన భాషను విని సుసంస్కృతమైన (చక్కగా సంస్కరింపబడిన) భాష అని శ్రీరాముడే మెచ్చుకున్నాడు. రాజనీతి చాతుర్యం కలవాడు గనుక ఇద్దరు బాధితుల నడుమ తొందరగా స్నేహం బలపడుతుందని గ్రహించి, శ్రీరామ, సుగ్రీవులను మైత్రీబద్ధులను చేసాడు. సుగ్రీవుడు రాజై స్థిరపడిన తరువాత సీతాన్వేషణ కోసం వానరులను నలుదిశల పంపించాడు. సంపాతి ఇచ్చిన సూచన మేరకు లంకా నగరంలో సీతమ్మ ఉండి ఉంటుందని భావించి సముద్ర లంఘనం చేయడానికి సిద్ధపడ్డాడు హనుమంతుడు. హనుమంతుడి చేతికే శ్రీరాముడు తన ముద్రికను ఇచ్చి పంపించాడు. ఆయనొక్కడే సీత జాడ తీయగలడని తెలిస్తే రాముడింత మంది వానరులను నలుదిశలా ఎందుకు పంపినట్లు? రావణుని రాజ్యం ఏదో ఒక దిశలో ఏదో ఒక్కచోట లేదు. నలుదిశలా వ్యాపించి ఉంది. అందుచేత నలుదిశలకు పంపవలసి వచ్చింది భటులను. కానీ స్వామి కార్యం ముందు- స్వకార్యం తరువాత అనే గాఢత, విశ్వాస పాత్రత ఆంజనేయుడిలోనే కనిపించి ఉంటుంది రాముడికి. అందుకే ముద్రిక ఆయన చేతికి. సీతాన్వేషణకై లంకకేగిన హనుమ చూపిన శక్తి, భక్తి, యుక్తి నిరుపమానమైనవి. అర్ధరాత్రి నారీజనులు నిద్రించే శయ్యాగారానికి వెళ్లవలసి వచ్చినప్పుడు ఆయన పడిన బాధ ఆయన బ్రహ్మచర్య దీక్షకు ఋజువు. రావణాసురుని శక్తియుక్తులను ఆయన అనుచరగణాలను, సైనిక సంపత్తిని అంచనా కట్టడం కోసం తనను బ్రహ్మాస్త్రం బంధించలేదని వరం ఉన్నప్పటికీ- బ్రహ్మాస్త్రానికి కట్టుబడి రావణుని కొలువుకూటంలోకి తీసుకొనిపోబడటం ఆయన మంత్రిత్వానికి, తెలివితేటలకు నిదర్శనం.

సీత జాడ తెలుసుకున్న తరువాత తిరిగి వచ్చిన ఆంజనేయుడు ఆ కబురు రామునికి హఠాత్తుగా చెప్పలేదు. అప్పడు రామయ్య తొడిమ చివర ముక్క పట్టుకొని వ్రేళ్లాడుతున్న పుష్పంలా కనిపించాడు. ఆశా నిరాశల మధ్య ఆయన ప్రాణదీపం కొట్టుకొంటున్నట్లున్నది. అందుకని





రామయ్యా అని పిలవకుండా "చూచితినయ్యా సీతను నే రామయ్యా" అన్నాడట. అదీ ఆయన ముందుచూపు. యుద్ధ సమయంలో లక్ష్మణుని ప్రాణరక్షణ కోసం సంజీవనిని మోసుకొని రావడంలో హనుమ చూపిన చొరవ సాటిలేనిది. సీతాదేవిని రాముడు శీలపరీక్ష కోరినప్పడు ఆ నాగరికుల తత్త్వాలకు హనుమ బెంగటిల్లిపోయాడు. శ్రీరామ భరతుల సమాగమంలో ఆ యిద్దరిలో ఎవరెవరైనదీ ఏర్పరచి తెలిసికోలేక ఆశ్చర్యపోయాడు. అడవిలో అష్టకష్టాలు పడిన రాముడిలాగే రాజ్యపాలనలో ఉన్న భరతుడు కూడా కృశించి ఉండటాన్ని చూచి, భరతుని తపస్సుకు ఎంతగానో పొంగిపోయాడు. సీతా రాములు ఆయనకు ఆరాధ్యదైవాలు. తన శారీరిక సత్త్వాన్నీ, మానసిక శక్తులను, తన వరబలాన్నీ, సమస్తాన్నీ మరచి, శ్రీరామ చరణాల ముందు వినమ్రుడై దాసాంజనేయుడైనాడు. అలాటి ఆత్మార్పణ, కర్పూరంలా కరిగి పోగల త్యాగగరిమే ఆయనను చిరంజీవిని చేసింది.

భగవంతుడు, భక్తుడు పరస్పర ఆశ్రితులు. ఈ మాట హనుమత్కథలో ఋజువవుతుంది. పట్టాభిషిక్తుడయిన శ్రీరాముని వీడ్కొని ఎక్కడి వారక్కడ వెళ్లిపోయారు. కొన్ని సంవత్సరాలు గడిచాయి. ఒకనాడు నిండు కొలువులో ఉన్న శ్రీరామ ప్రభువు చటుక్కున సింహాసనం విడిచి ముందుకు కదిలాడు. ఏమైందో తెలియక కొలువంతా నిలబడింది. రాముడు ద్వారంవైపే చూస్తూ ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తున్నాడు. హనుమంతుడు వస్తున్నాడు. ఆయన దృష్టి శ్రీరాముని మీదనే లగ్నమై ఉన్నది. సభాసదులంతా వారిద్దరినే చూస్తున్నారు. ఇద్దరూ సభామంటపం మధ్యలో కలుసుకున్నారు. హనుమ శ్రీరామ పాదాలకు నమస్కరించేందుకు వంగబోయినాడు. రాముడు చేతులు చాపి అతన్ని గాఢంగా కౌగిలించుకున్నాడు. ఇద్దరి కన్నుల వెంట ఆనంద బాష్పధారలు-చిరకాలపు ఎడబాటు తరువాత కలుసుకున్న ప్రేమార్ద్రత ఆ భగవంతుడు, భక్తుల కన్నుల గుండా ప్రవహిస్తూండటం చకితులై చూస్తుండిపోయారు సభాసదులు. అంతటి సాన్నిహిత్యాన్ని పరమాత్ముని చెంత పొందగలగడానికి హనుమ

లోని శరణాగత తత్త్వం, నిర్మలత్వం, ఏకాగ్ర భక్తే కారణాలు. అందుకే వానరుడిలా జన్మించిన ఆ హనుమంతుడు నరదశను దాటి దివ్యస్థితిని చేరుకొని పూజలందుకొంటున్నాడు. హనుమ చిరంజీవి. నేటికీ శ్రీరామ సంకీర్తనం ఎక్కడ వినిపిస్తే అక్కడ కనులనిండా నీరు నింపుకొని రెండు చేతులు శిరస్సున ఘటించి వచ్చి నిలబడతాడు. గోదావరీ తీరంలో ప్రతి రెండు, మూడు మైళ్ళ కొకటిగా వెలసి ఉన్న హనుమంతుని కోవెలలు చూస్తుంటే రామ నామ స్మరణతో ఆ నేల పునీతమవుతున్నట్లు అనిపిస్తుంది.

ఆంజనేయుడు బ్రహ్మచారులకు, విద్యార్థి దశలో ఉన్నవారికి గొప్ప ఆదర్శ మూర్తిగా నిలుస్తాడు. ఆయన కథ సవివరంగా పిల్లలకు చెప్పడం చాలా అవసరం. ఆయనలోని దైవభక్తి, శరీర శక్తిని (నైతిక బలాన్ని కూడా) యుక్తులను కూడా నేటి పరిస్థితులలో పిల్లలు అలవరచుకోవడం నేటి పరిస్థితులలో దేశానికి చాలా అవసరం. హనుమజ్జయంతినాడు కనీసం మీ పరిసరాలలో ఉన్న పది మంది పిల్లలకైనా హనుమత్కథ వివరంగా చెప్పండి.

## దశనామ్ని

భారతదేశంలో హిందువులు చతురాశ్రమ ధర్మాలు పాటించటం సనాతన ధర్మం. బ్రహ్మచర్యం, గార్హస్థ్యం (గృహస్థ ధర్మం), వానప్రస్థం, సన్యాసం-ఈ నాలుగూ నాలుగు పాతిక సంవత్సరాలుగా జీవించేవారు. బ్రహ్మచర్యంలో ధార్మిక విషయాల బోధన ప్రాథమికంగా జరిగేది. గృహస్థ జీవనంలో కొన్ని ధర్మాలు-మాతా పితృసేవ, అతిథి సంతర్పణలు, గృహ దేవతా పూజ వంటివి జరిగేవి. వానప్రస్థంలో గురుపాదాల చెంత ఆశ్రమాల్లో జీవిస్తూ ధర్మాలన్నిటినీ పునశ్చరణ చేసుకొని సాధన చెయ్యాలి. తదుపరి సన్న్యసించి, తాము నేర్చిన ధర్మాలను సమాజంలో ప్రచారం చేస్తూ దేశమంతా పర్యటించి, చివరికి ఏకాగ్రతపస్సుతో జీవితం చాలించాలి. ఇదీ విధానం.

ఇందులో సన్న్యసించినవారు తమకు దీక్షనిచ్చిన గురుపరంపరను బట్టీ, విధానాలనుబట్టీ రకరకాల పేర్లు పెట్టుకొంటారు. ఇవి దశవిధ నామాలని పిలవబడతాయి. వాటి వివరాలు దిగువ ఇస్తున్నాము. మన





అనూచాన ఆచారాలు, విధి విధానాలు తెలుసుకోవటం మన ధర్మం అని మా భావన.

**1. తీర్థ :-**

**"త్రివేణీ సంగమే తత్త్వ మస్యాది లక్షణే।**
**స్నాయాత్ తత్త్వార్థ భావేన తీర్థ నామా స ఉచ్యతే॥**

- త్రివేణీ సంగమ స్థలంలో జలకమాడి, 'తత్త్వమసి' (ఆ దైవం నీవే అన్న సత్యం గ్రహించి, సన్న్యసించిన వారిని 'తీర్థ' అని పిలుస్తారు.

**2. ఆశ్రమ :-**

**"ఆశ్రమ గ్రహణో ప్రౌఢః, ఆశాపాశ వివర్జితః।**
**యాతాయాత వినిర్ముక్తః ఏతదాశ్రమ లక్షణః॥"**

- ఏదో ఒక్కచోట (ఆశ్రమంలో) నివసిస్తూ ప్రయాణాలు విడిచిపెట్టి, ఆశాపాశం విడిచి (కోర్కెలు లేకుండా) జీవించే సాధుపురుషుడు 'ఆశ్రమ' నామం పొందుతాడు.

**3. వనః :-**

**"సురమ్యా నిర్జనే దేశే వాసం నిత్యం కరోతియః।**
**ఆశాపాశ వినిర్ముక్తః వన నామ స ఉచ్యతే॥"**

- మనుష్య సంచారంలేని వనసీమల లోపల నివసిస్తూ, ఐహిక బంధాలను, ఆశాపాశాన్నీ కూడా విడిచిపెట్టి నిశ్శబ్దంగా జీవించే సన్యాసి పేరు చివర 'వన' అని చేరుతుంది.

**4. అరణ్య :-**

**"అరణ్యే సంస్థితో నిత్యం ఆనందం నందనేవనే।**
**త్యక్త్వా సర్వమిదం విశ్వం అరణ్యం లక్షణం కిల॥**

- ప్రపంచానికి పూర్తి దూరంగా భీకరమైన అరణ్యంలో ఉంటూ కూడా తానేదో పుష్పవనంలో ఉన్నట్లుగా ఆనందానుభూతి చెందుతూ జీవించ గలవాడు 'అరణ్య' నామానికి అర్హుడు.

**5. గిరి :-**

**"వాసో గిరివరే నిత్యం గీతాభ్యాసే హి తత్పరః।**
**గంభీరాచల వృద్ధిశ్చ గిరినామ స ఉచ్యతే॥"**

- ఏదో ఒక శిఖరాగ్రంపై ఏకాంతంగా నిలచి, తాను కూడ ఒక పర్వతాగ్రంలాగే సుస్థిరుడై క్రమం తప్పకుండ గీతాపఠనంలో నిమగ్నుడై

ఉండేవాడు గిరినామ ధారి అవుతాడు.

**6. పర్వత :-**

**"వసేత్ పర్వత మూలేషు ప్రౌఢో యో ధ్యాన తత్పరః ।**
**సారాసారం విజానాతి పర్వతః పరికీర్తితః ॥"**

-అధిత్యకలలో-అంటే పర్వతాల దిగువభాగాలలో నివసిస్తూ, నిరంత ధ్యానతత్పరుడై సృష్టిలోని సార, అసారాలను గూర్చి విచారణ చేస్తూ ఉండేవాడు పర్వతనామకుడు.

**7. సాగర :-**

**"వసేత్ సాగర గంభీరే ఘనరత్న పరిగ్రహః ।**
**మర్యాదాశ్చ లంఘేత సాగరః పరికీర్తితః ॥"**

- ఆశ్రమ నియమాలు అతిక్రమించకుండానే జ్ఞానసాగరపు లోతులు తడిమిచూచి సత్యరత్నాలు సాధించినవాడు "సాగర" నామాంకితుడు.

**8. సరస్వతి :-**

**"స్వరజ్ఞాన వశో స్వరవాదీ కవీశ్వరః ।**
**సంసార సాగరే సారాభిజ్ఞోయః సః సరస్వతీ॥"**

- సరస్వతీ అనే పేరు స్వీకరించే సన్యాసి అనంతమైన అధ్యయనంతో జ్ఞానార్జన చేయాలి. వేదపనసలు తెలిసియుండాలి. వివేకియై యీ అశాశ్వత ప్రపంచాన్ని ఎలా దాటాలో సారం తెలిసియుండాలి. అతడే సరస్వతి.

**9. భారతి :-**

**"విద్యాభారేణ సంపూర్ణః, సర్వభారం పరిత్యజేత్ ।**
**దుఃఖభారం నజానాతి భారతీ పరికీర్తితః ॥"**

- భారతీ నామ సంకీర్తితుడు ఆత్మవిద్యాభారం ఒక్కటి తప్ప మిగిలిన ఐహిక భారాలన్నిటిని విడిచిపెట్టి దుఃఖరహితుడై అభిజ్ఞుడై ఉండాలి.

**10. పురి :-**


**"జ్ఞాన తత్త్వేన సంపూర్ణః పూర్ణతత్త్వే పదే స్థితః ।**
**పరబ్రహ్మ రతో నిత్యం పురీ నామ స ఉచ్యతే ॥"**

- బ్రహ్మ జ్ఞానియై ఆధ్యాత్మిక శక్తి సాధించి పరిపూర్ణుడై నిర్మల జ్ఞానానందములో నిలిచి ఉండేవాడు పురి.





# శ్రీ గజానన విజయం



**- ప.పూ.శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు**

**(గత సంచిక తరువాయి)**

## 9వ అధ్యాయం

సాధారణంగా మహాత్ముల దగ్గరకు అనేకమంది భక్తులు ఆకర్షించబడుతూ ఉంటారు. వారిలో సహజంగా అర్థార్థులే అధికంగా ఉంటూ ఉంటారు. జిజ్ఞాసతోనూ, జ్ఞానార్జన కోసమున్నూ వచ్చే వారి సంఖ్య తక్కువగానే ఉంటుంది.

ఒకసారి బాలాపూర్ నుండి ఇద్దరు వ్యక్తులు స్వామి దర్శనానికి వచ్చారు. వారు వచ్చేటప్పుడు మహరాజ్ కోసం గంజాయిని తెద్దామనుకున్నారు. అనుకున్నదే తడవుగా ఆ విషయం మరచిపోకుండా ఉండటానికి ఉత్తరీయాల కొసన ముడులు కూడా వేసుకున్నారు. అయితే ప్రయాణపు హడావిడిలో ఈ విషయాన్ని వాళ్ళు మరిచేపోయినారు. మళ్ళీ యింకొకసారి వచ్చినప్పుడు కూడా యిలాగే జరిగింది.

వాళ్ళు స్వామికి ప్రణమిల్లుతున్నప్పుడు స్వామి యిలా అన్నారు. "చూచారా! లౌకికుల చర్యలు ఎలా ఉంటాయో! వాళ్ళు గుర్తు కోసం కొంగు ముడి వేసుకుంటారు. అయినా మరచిపోతూనే ఉంటారు. ఉన్నత కులస్థులైన బ్రాహ్మణులు-సమాజానికి మార్గదర్శకులుగా ఉండవలసిన వాళ్ళు కూడా మాట నిలబెట్టుకోవటం లేదు, వాగ్దానాన్ని నెరవేర్చనూ లేదు. జనులందరిలోనూ ముఖ్యంగా బ్రాహ్మణులు మరచిపోవటాలుగాని, మాట తప్పటాలుగాని ఉండకూడదు. అలా అయితే సమాజానికి ఏం బోధిస్తారు? ఏదో సమర్పించుకోవాలని నిర్ణయించుకున్నారు. కాని దాన్ని నెరవేర్చటం లేదు. ఆలోచననూ మాటకూ, చేతకూ సమన్వయం

ఉండాలి. దీన్నే త్రికరణ శుద్ధి అంటారు.

ఓ భాస్కరా! హృదయం పవిత్రంగా ఉన్నవారిని మాత్రమే ఆ భగవానుడు కరుణిస్తాడు". ఇదంతా వింటున్న ఆ యిద్దరు వ్యక్తులు తమ అపరాధానికి సిగ్గుపడ్డారు. ఇంతకీ తమ మనస్సులోని విషయాలు మహారాజులు ఎలా కనుక్కున్నారు-అని ఆశ్చర్యపడుతూ అక్కడనుండి బయటకు వెళ్ళి ఎవరి దగ్గరనుండైనా గంజాయి వెంటనే తెచ్చి స్వామికి సమర్పించాలనుకొంటూ లేవబోతున్నారు. అది గమనించి స్వామి అన్నారు "నాయనలారా, యిప్పుడు మీరేమీ ఇక్కడ నుండి కదలవలసిన అవసరం లేదు. గంజాయిని నేనేమీ వాంఛించను. నేను కోరేదల్లా మీరు నిర్మల హృదయంతో సంకల్పించి నిజాయితీగా కార్యాలను నిర్వహించటమే. జనులు స్వార్థంతో నా చుట్టూ మూగి ఇబ్బందులు పెట్టకుండా ఉండాలంటే నా పట్ల వ్యతిరేకత కలగాలనే ఉద్దేశ్యంతో పిచ్చివాడల్లే కన్పించటం, దిగంబరంగా తిరగటం, గంజాయి పీల్చటం చేస్తూ ఉంటాను. ఒకప్పుడు బాలకుని మాదిరిగా, మత్తుడుగా, పిశాచం మాదిరిగా కన్పిస్తూ ఉంటాను. నాకు దేని మీదా కోరిక ఉండదు. సర్వజనులూ నీతి నిజాయితీతో, భక్తి ప్రపత్తులతో జీవించాలనే మా వంటి వారి కోరిక. ఇక మీరు వెళ్ళవచ్చు. మీ సమస్యలు తీరుతాయి. వచ్చేవారం మీరీ ప్రదేశానికి రావాలి. అలా ఐదుసార్లు చేయండి. ఇక్కడ మృడానీనాథుడు శంకరుడు నివసిస్తున్నాడు. అతని కరుణే కుబేరుడిని ధనపతిగా చేసింది. వెళ్ళి శంకరునికి మ్రొక్కండి. మళ్ళీ వచ్చేటప్పుడు మాత్రం గంజాయిని తేవటం మరచిపోకండేం!

వారి ఆజ్ఞ ప్రకారం ఆ ఇద్దరు వ్యక్తులు శివునికి సాష్టాంగ నమస్కారాలు చేసి బాలాపూర్ చేరుకున్నారు. ఆ మరుసటి వారానికల్లా వాళ్ల సమస్యలన్నీ పరిష్కరింపబడ్డాయి. అది మహాత్ముల ఆశీర్వచన ప్రభావం. స్వామి చెప్పి నట్లుగానే వారు షేగాంవ్ వచ్చారు. గంజాయితేవటం మాత్రం మరచి పోలేదు.

**(సశేషం)**





ఓం శ్రీ సాయిరాం



# షిరిడీ డైరీ

**– మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే**

**అనువాదం : మాతా శుకవాణి**

(గత సంచిక తరువాయి)

03-02-1912

నేను లేవటం ఆలస్యమైంది. ఏదో బద్ధకపు తెర కమ్మినట్లుంది. దీక్షిత్ ఆలస్యమయ్యాడు. దాదాపు ప్రతివారూ అంతే. నా ప్రార్థన తరువాత మసీదుకు వెడితే బాబా లోపలికి రాకుండా ఊదీ తీసుకొని వెళ్లిపొమ్మన్నారు. నేనలాగే చేసి జోగ్ యింటికి వెళ్లి పంచదశి చదువుతూ కూర్చున్నాను. ఉపాసనీ, జోగ్, శ్రీమతి కౌజల్గీలతో కలిసి మధ్యాహ్నం దాకా చదువుతూనే ఉన్నాను. అప్పుడు హారతికి వెళ్లాము. భోజనానంతరం కాస్త విశ్రాంతి తరువాత దాసబోధ చదువుతూ కూర్చున్నాను. సాయంత్రం దీక్షిత్ రామాయణం చదివాడు. స్థానిక భక్తుడు గణోబాఆబా అనే ఆయన కూడా వినటానికి వచ్చారు. అతనికి చాలా శ్లోకాలు తెలుసు. అనేకం కంఠస్థం వచ్చు కూడా. ఆయన బాబాను వాహ్యాళి సమయంలో దర్శనం చేసుకున్నాడు. మాధవరావు నా అమరావతి ప్రయాణానికి అనుమతి అడిగాననీ, "నేను ముసలివాడిని. నా మర్యాద వదులుకోవటం నాకిష్టం లేదు" అంటూ అనుమతి తిరస్కరించారనీ అన్నాడు. అప్పు డాయన రెండు వందల మంది జనం పొరుగూరికి వెళ్లారనీ, వాళ్లను దుండగులుగా అనుకొన్నారనీ అందులో అనవసరంగా మాధవరావు పేరు కూడా చేర్చబడిందనీ, దాని వలన యిబ్బంది కలిగిందనీ అన్నాడు. రాత్రి వాడా హారతి, తరువాత శేజారతి రెండింటికీ వెళ్లాను. భీష్మ భజన చెయ్యలేదుగానీ, భాగవతం చదివాడు. తరువాత దీక్షితు రామాయణం సాగింది.

### 04-02-1912

ఉదయం పెందలకడ లేచాను. కాకడహారతికి హాజరయ్యాను. ప్రార్థనానంతరం నేను స్నానం చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు నారాయణరావు బామన్ గాంవ్‌కర్ గురించి విచారిస్తూ వచ్చారు. వారు లింగాయత్ శాస్త్రులు. పెద్దాయన పేరు శివానంద శాస్త్రి. వారితో ఇద్దరు బ్రాహ్మణ స్త్రీలున్నారు. పెద్దామె పేరు బ్రహ్మానందబాయి. సుమారు మూడేళ్ల క్రితం ఆమె నాసిక్‌లో నిత్యానందబాయి అనే లింగాయత్ స్త్రీని కలిసింది. ఆమె యోగాలో బాగా ముందుకువెళ్లిన మనిషి. బ్రహ్మానందబాయికి ఉపదేశం చేసింది. మేమందరం సాయి మహరాజ్ బయటికి వెళ్లడం, తిరిగి లోపలికి రావడం కూడా చూచాము. బ్రహ్మానందబాయి బాబాను పూజించింది. తర్వాత రెండు హారతులు మనోహరంగా పాడింది. మధ్యాహ్నం భోంచేసి కాసేపు పడుకున్నాను. దీక్షిత్ పురాణం జరిగింది. అటుపైన బాబా సాయంత్రం నడకకు వెళ్లేటప్పుడు దర్శించుకున్నాను. వాడాలో హారతి జరిగింది. దీక్షిత్ పురాణం, భీష్మ భజన జరిగాయి. బ్రహ్మానందబాయి, ఆమె సహచరురాలు కూడా చాలా హాయిగా పాడారు. ఆ భజనకు మేమంతా ఆనందించాం. శివానందశాస్త్రిగారు కూడా పాడారు. ఆ స్త్రీలు, ఆయన నాసిక్ నుండి వచ్చారు. వారక్కడ శాశ్వతంగా ఉండేవారే.

### 05-02-1912

ఉదయం నా ప్రార్థన పూర్తి చేసానో లేదో రాజారామ్‌పంత్ దీక్షిత్ నాగపూర్ నుండి వచ్చాడు. ఆయన కాకాసాహెబ్ దీక్షిత్ అన్నగారు. ఆయన సాయి సాహెబ్‌ని చూడటానికి వెళ్లారు. నేను మా క్లాసుకి వెళ్లాను. జోగ్, ఉపాసనీ, శివానందశాస్త్రి, బ్రహ్మానందబాయి తదితరులు కలిసి పంచదశి అమృతానుభవంలో ఒక శ్లోకం చదివాం. మేము సాయి సాహెబ్ బయటికి వెళ్లటం, తిరిగి రావటం చూచి మసీదుకు వెళ్లాం. సాయి నా పట్ల చాలా దయతో ఉన్నారు. కొద్ది మాటలు మాట్లాడారు. అందరినీ పంపించేశాక నన్ను పేరు పెట్టి పిలిచి నా బద్ధకం వదిలించుకోమన్నారు. స్త్రీలను, పిల్లలను చూడమన్నారు. శ్రీమతి లక్ష్మీబాయి కౌజల్గీకి ఒక రొట్టెముక్క యిచ్చి, వెళ్లి రాధాకృష్ణబాయి దగ్గర తినమన్నారు. ఇది గొప్ప అదృష్టం, ఇకమీదట యీామె చాలా ఆనందంగా ఉంటుంది.





నేను శివా నందశాస్త్రిని, బ్రహ్మానందబాయిని, వాళ్లతో ఉన్న వారందరినీ మధ్యాహ్న భోజనానికి మా దగ్గరకు పిలిచాను. తర్వాత కొన్ని నిముషాలు పడుకొని లేచి దీక్షిత్ రామాయణం విన్నాను. తర్వాత సాయిబాబా నడకకు వెళ్లేటప్పుడు దర్శనానికి వెళ్ళాం. తర్వాత వాడా హారతి, అటుపై శేజారతి జరిగాయి. రాత్రి బ్రహ్మానంద బాయి అత్యద్భుతంగా అర్ధరాత్రి దాటేవరకు భజనలు చెప్పింది. నేను వెళ్లే విషయం ప్రస్తావనకు వచ్చింది. రేపు నిర్ణయం కావచ్చు.

**(సశేషం)**

## స్వరాంజలి

**మధురాపంతుల రాజగోపాలరావు**


వందనములు గురుపరమేశా!
వందనమో జ్ఞానసాగరా!
వందనము భవబంధకుఠారమ!
వందనం గురు నిరంకారా॥ ॥వం॥

కామక్రోధముల అంధకారమున
వెలుగులనీను సూర్యుడవై
లోభమోహ మృగతృష్ణలలో
చల్లని చలివేంద్రము నీవై
మదమచ్చరముల కానలలో
తోడు నడచి రక్షింపరా ......... ॥వం॥

జంకూ, భీతీ తరిమిన వేళ
అందింపవ నీ స్నేహహస్తము!
నిరాశాతిమిరం ముసిరిన వేళ
వెలిగింపవ ఆశాదీపం!
సుఖమో దుఃఖము గురుప్రసాదమే -
గోపాలుని బలము గురుచరణములే ........

వందనములు గురుపరమేశా!
వందనమో జ్ఞానసాగరా!
వందనము భవబంధకుఠారమ!
వందనం గురు నిరంకారా॥ ॥వం॥

# శుకవాణి



- మాతా శుకవాణి

"హరి నెఱుంగక యింటిలో బహుహేయనంబులు మత్తు(డై
పొరలుచుండెడి వెఱ్ఱిముక్తికి(బోవనేర్చునె? వా(డు సం
సరణముం బెడబాయ(డెన్న(డు సత్య మా హరినామ సం
స్మరణ మొక్క ముహూర్త మాత్రము సాలు ముక్తిదమౌ నృపా!"

- పరమాత్ముని లోతులు ఎరుగకుండా ఏళ్ళ తరబడి సంసారపు మత్తుతో మునిగి ఉండేవానికి ముక్తి లభించదు. వాడు సంసారాన్ని ఎన్నటికీ విడువలేడు. సర్వశక్తులలో ఒకేచోట లయింపజేసి ఒక్క క్షణకాలం దైవనామస్మరణ చేసిన ముక్తి తప్పక లభిస్తుంది.

దీనికి ఆధారంగా జన్మముక్తులు శుకమహర్షుల వారు పరీక్షిత్తునకు ఉపదేశించినది పై పద్యం. దానికి ఉపబలకంగా వారు ఖట్వాంగుని కథ చెప్పారు. పూర్వం ఖట్వాంగుడు అనే రాజు సప్తద్వీపాలను పరిపాలిస్తుండే వాడు. దేవ దానవ యుద్ధంలో దేవతలకు సహకారంగా నిలబడి, దానవ వధ జరిపాడు. వరమిస్తామన్న దేవతలతో-"నాకవేమీ వద్దు గానీ నాకెంత ఆయువున్నదో చెప్పమ"న్నాడు. వారు, "ఒక్క ముహూర్తమే ఉన్నద"న్నారు. వెంటనే అతను భూమికి దిగి వచ్చాడు. నడగొండల వంటి ఏనుగులను, గుర్రాలను, ప్రాణానికి మిన్నగా ఉన్న ఇల్లాళ్ళను, బంధుమిత్రులను, సమస్త సంపత్తిని విడిచి ప్రగాఢమైన వైరాగ్యంతో పరమాత్ముని సంకీర్తన గావించి కేవలం రెండు గడియలలోనే ముక్తిని పొందగలిగినాడు.

ఈ కథ చెప్తూ శుకుడు- "ఏమయ్యా, నీకు ఇంకా ఏడు రోజుల కాలం ఉంది. అంత సమయంలో ఎన్నెన్నో సాధనలు చెయ్యవచ్చు. శ్రేష్ఠమైన స్థితిని సాధించవచ్చు" అని పరీక్షిత్తుకు సాంత్వన కలిగించి, ఏ విధంగా మనస్సును బంధించాలో వివరించి అతనిని కార్యోన్ముఖుని చేసాడు. ఇది మనకూ ఉపదేశమే!





# మాతృసంస్థ కబుర్లు

ఫిబ్రవరి 17వ తేదీ శివరాత్రి. ఆనాటి పగలు విశేషపూజలు జరిగాయి. అర్ధరాత్రి 12 గంటలకు శ్రీ లింగోద్భవ వేళ సాయీశ్వరునికి అభిషేకం జరిగింది ద్వారవతిలో. సత్తెనపల్లి ఆనందసాయి మందిరంలో మట్టితో చేసిన శివలింగానికి లింగోద్భవ వేళ అభిషేకం, పూజ జరిగాయి.

ఫిబ్రవరి 20వ తేదీ గురుదేవులు తమ బృందంతో సత్తెనపల్లి ఆశ్రమానికి బయలుదేరి వెళ్ళారు. అక్కడ 21వ తేదీన ఒక సత్సంగ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు అక్కడి నిర్వాహకులు. ఆ రోజు గురుదేవుల (ఆంగ్ల కాలమానం ప్రకారం) పుట్టినరోజు కావటంతో అక్కడి భక్తులు చాలా ఉత్సాహంతో ఈ సమావేశంలో పాల్గొన్నారు. గురుదేవులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పుష్పాక్షతలు చల్లుతూ మందిరంలోకి తీసుకువెళ్ళారు. వారిని కూర్చుండబెట్టి గురుపూజ చేసుకున్నారు. భజనలు, కోలాటాలు, చిట్టి పొట్టి నాటికలు, పాటలతో సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. అంతకుముందు వారం రోజుల క్రిందటే కబడీ, కోకో, వాలీబాల్, మెమొరీ టెస్ట్, మ్యూజికల్ చెయిర్స్, బాబా వారి ఏకాదశ వాగ్దానాలు వ్రాయటం వంటి వాటిలో పోటీలు నిర్వహించారు. వాటిలో విజేతలైన వారికి బహుమతి ప్రదానం కూడా చేసారు. గురుదేవులు తమ ఆశీః ప్రవచనం చేసాక భక్తులందరూ వారికి పాదాభివందనాలు చేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆటల పోటీల నిర్వహణ, పుష్పాలంకరణ, ప్రసాద వితరణ, బహుమతులు-ప్రతి దానికీ ఉత్సాహంగా భక్తులే ముందుకు రావటం ముదావహం. ప్రసాద వితరణ తరువాత ఆ రాత్రి విశ్రాంతి తీసుకుని, మరునాటి ఉదయమే బయలుదేరి రేపల్లె వెళ్ళారు గురుదేవులు. ఆ సాయంత్రం విజయలక్ష్మి, సావిత్రి, సత్యనారాయణ, విజయ-మరి

కొంతమంది భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకొన్నారు. యథాప్రకారం శారదక్కయ్య ముందుగానే మేము వెళ్లేటప్పటికే వచ్చేసింది. మరునాటి ఉదయాన్నే బయలుదేరి మధ్యాహ్నానికి సత్తెనపల్లి ఆశ్రమానికి చేరుకొని భోజనాలు చేసి, కొంచెం చల్లబడ్డాక బయలుదేరి రాత్రికి సాయిధామం ఆశ్రమం చేరుకున్నారు.

మార్చి ఒకటవ తేదీన తిరిగి గురుదేవుల బృందం తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో నూతనంగా నిర్మాణమైన శ్రీ సాయి దేవాలయంలో విగ్రహప్రతిష్ఠ నిమిత్తమై బయలుదేరారు. ఉదయాన్నే ఆశ్రమం నుంచీ బయలుదేరి విజయవాడ చేరారు. ఆశ్రమానికీ, గురుదేవులకూ కూడా అభిమానులైన శ్రీ ముప్పాళ్ళ దశవంతరావు, శ్రీమతి దేవకీగార్ల ఆతిథ్యం స్వీకరించి, రెండు గంటల విశ్రాంతి తరువాత నిడదవోలు బయలుదేరి సాయంత్రానికి అక్కడికి చేరుకున్నారు. శ్రీమతి, శ్రీ మడిపల్లి భాస్కరం గార్ల యింటిలో విడిది. వారు ఎంతో గౌరవంగా చక్కని ఆతిథ్యం యిచ్చారు. అనపర్తి నుంచి సాయి పారాయణ ప్రచారకుడు దేవానందరెడ్డిగారు, ఆయన భార్యగారు, శ్రీమతి మంగయ్యమ్మగారు మా కోసం వచ్చి ప్రొద్దుపోయే దాకా మాతో ఉండి వెళ్లారు. మరునాటి ఉదయం ఎనిమిదిన్నరయ్యే టప్పటికి ఆలయం దగ్గరికి చేరుకున్నాము. ఆలయం రెండంతస్థులుగా ఉంది. విగ్రహ ప్రతిష్ఠ పై భాగంలో. ఎలాగో చేరాము పైకి. విగ్రహప్రతిష్ఠ పూర్తికాగానే స్వామీజీ ప్రవచనార్థం దగ్గరలోనే షామియానాల క్రింద ఏర్పాటు చేసిన వేదిక వద్దకు తీసుకువెళ్లారు. అక్కడ సమావేశమైన సాయిభక్తులకు తమదైన శైలిలో శ్రీ సాయి బోధలను గురించి ప్రవచించారు స్వామీజీ. అటుపైన ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి శ్రీ డి. శంకరయ్యగారు సాయి విశిష్టతను గురించి లఘు ప్రసంగం చేసారు. తదుపరి సినీ హాస్యనటులు చిట్టిబాబుగారు మొదట గురుదేవుల దర్శనం తనకెక్కడ కలిగిందీ, సాయిదేవుని కనులలోని వాత్సల్యం, కారుణ్యం తమకు మళ్లీ స్వామీజీ కనులలోనే ఎలా కన్పించిందీ





వివరిస్తూ, తాము సాయిధామానికి వచ్చి వారి పాదస్పర్శ చేసి సంతృప్తులమయ్యామని గుర్తు చేసుకున్నారు. సాయి గురించి స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు. చివరగా కృష్ణభగవాన్‌గారు సాయిబోధలు పైకి తేలికగా కన్పిస్తూనే ఎంత కష్టమో, ఎంత లోతులకు తీసుకువెడతాయో వివరించారు. తదుపరి శ్రీ సాయిదాసుగారి సంకీర్తనం జరిగింది. ఆపైన ఆలయ వ్యవస్థాపకులు శ్రీ శ్రీకంఠం శ్రీనివాసు గారు గురుదేవులను సముచితరీతిన సత్కరించు కొన్నారు. అప్పటికి పదకొండు దాటింది. మేము తిరుగుప్రయాణానికి సన్నద్ధులమైనాముగానీ శ్రీ భాస్కరం దంపతులు మాకు ఉపాహారం చేసి యిచ్చేవరకు వదిలిపెట్టలేదు. వారి అభిమానం మరుపురానిది.

విజయవాడలో సిద్ధార్థ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్న మా డా॥ ఝాన్సీ మమ్మల్ని రోడ్డు మీదకే వచ్చి కలుసుకున్నది. డాక్టర్ బాబూరావుగారి ప్రకృతి వైద్యశాల (పెనమలూరు)కు వెళ్లాం అందరం కలిసి. చిరకాలమిత్రులు బాబూరావుగారితో ఒక గంటసేపు గడిపి, ఆసుపత్రి చూచి, వారి అమ్మాయి ఆతిథ్యం స్వీకరించి, ఆ చల్లని ఆశ్రమ వాతావరణాన్ని విడిచి మళ్లీ ప్రయాణం సాగించాము. డా॥ ఝాన్సీ విజయవాడ సరిహద్దుల వరకూ వీడ్కోలిపి, కొన్ని తినుబండారాలు కొనిచ్చి మరీ వెళ్లింది. రాత్రి ఎనిమిదిన్నరకల్లా ఆశ్రమానికి చేరుకొన్నది యాత్రాబృందం.

మార్చి 7వ తేదీ ఫాల్గుణ బహుళ విదియనాడు పరమపూజ్య గురుదేవుల జన్మతిథి. సాయికళ్యాణి-ఆడిటోరియం హాల్‌లో ఉత్సవం ఏర్పాటైంది. గత ప్రయాణం తాలూకు అలసటతో, స్వల్ప అనారోగ్యాలకు లోనైన బృందం వాటిని విదిలించేసుకొని రంగంలోకి దిగింది. ఉద్దమర్రి, బొమ్మలరామవరం, అంకిరెడ్డిపల్లె, తెనాలి, హైదరాబాదు మొదలైన చోట్లతో పాటు అమెరికాలోని కొందరు భక్తులు కూడా స్వామీజీ క్షేమార్థం శ్రీ సాయి సచ్చరిత్ర పారాయణ చేసారు. కొన్నిచోట్ల భజనలు, అన్నదానాలు, ఫలదానాలు కూడా జరిగాయి. అనేక దేవాలయాలలో విశేషపూజలు

జరిగాయి. సాయినామంతో ఏరిన బియ్యపుగింజలు అక్షతలకు వచ్చాయి. ఉదయం మేలుకొలుపుతో ప్రారంభమైన సాయి సేవ ఉద్దమర్రి, రామారం, తెనాలి, బెంగుళూరు- యింకా వివిధ గ్రామీణుల క్షీరాభిషేకం, జలాభిషేకం, పూజలతో ఎనిమిదింటిదాకా సాగింది. తదుపరి సాయి పారాయణ ఫలితాలు గురుదేవుల క్షేమార్థం ధారపోయటం, నామం చెప్పటం మరికొంతసేపు జరిగింది. చివరికి పదిన్నర గంటల వేళ గురుదేవులు శ్రీ సాయి దర్శనం చేసుకొని కళ్యాణిలోకి వేంచేసారు. చక్కని పుష్పాలతో గుడి, కళ్యాణి కూడా అలంకరించారు. శ్రీమతి విజయ, ప్రభావతి '76' ఆకృతిలో దీపాలు పెట్టి వన్నెవన్నెల పుష్పాలతో, పత్రాలతో అలంకరించారు. గురుదేవులు వేదిక మీద దీపప్రజ్వలన చేసి, ఆసీనులైనారు. రాంబాబు ఆహుతులందరికీ ఆహ్వానం పలికి, గురుదేవులకు అష్టోత్తర శతనామ పూజ చేసాడు. ఆశ్రమ బాలలు చి॥ చైత్రలక్ష్మి చి॥ సాయిసుధీర హారతివ్వగా దివ్య, మంజుల పాట పాడారు. మాతాజీ స్వామీజీ గురించి చెప్తూ తండ్రి మాణిక్యం, తల్లి వజ్రం అయినప్పుడు వారికి జన్మించిన తనయుడు కాంతులు విరజిమ్మడంలో ఆశ్చర్యం లేదని చమత్కరించారు. (గురుదేవుల తండ్రిగారి పేరు మాణిక్యారావుగారు, తల్లి పేరు వజ్రమ్మగారు) అందరూ పుడతారుగానీ పుట్టినది ఎందుకో క్షణక్షణం గుర్తు పెట్టుకొని, జన్మ ధన్యం చేసుకొనేది కొందరేననీ, అటువంటి ధన్యభాగుల వలన విశ్వం కాంతిమంత మవుతుందనీ అన్నారు. అనేకమంది గురువులుంటారనీ అధీతి, అధ్యయనాలు చేసి అటుపైన బోధకు ఉపక్రమించటం సామాన్యులకు అలవాటనీ, మూడవ మెట్టయిన ఆచరణను మర్చిపోతుంటారనీ, అలాకాక తాము ముందుగా ఆచరించాక బోధించే వారు సద్గురువులనీ, అలాటి సద్గురు జన్మదినమే శిష్యులలో అజ్ఞానానికి మృత్యు దినమనీ అన్నారు. అలాంటి గురుదేవులకు మనసా, వాచా ప్రణమిల్లు తున్నామన్నారు. తరువాత గురుదేవుల ఉపదేశరీతిని గూర్చిన చిరు పుస్తకాన్ని ఆవిష్కరించి, వచ్చిన వారందరికీ ఉచితంగా పంచిపెట్టారు.





అటుపైన శ్రీ గురుదేవులు పుట్టినరోజునాడు దీపాలు ఆర్పే పాశ్చాత్య సంప్రదాయానికీ, వెలిగించే ప్రాచ్య సాంప్రదాయానికీ భేదం వివరించారు. "ఆ ఏటికాయేడు తనలో జ్ఞానదీప్తిని పెంచుకొంటూ ఆదిలో పశు(పసి) ప్రాయుడుగా ఉన్న మనిషి క్రమంగా పురుషోత్తమ స్థాయికి ఎదగాలనీ, తనను ఒక్కొక్క మెట్టూ ఎక్కించిన పరమాత్మునికి కృతజ్ఞతలు తెలియ జేసుకొంటూ తన వయసన్ని దీపాలు దేవుని ముందు పెట్టాలన్నది మన సంప్రదాయంలోని విశిష్టత అనీ చెప్పారు. క్రమంగా ఒక 'షష్టి' (అరవై) సంవత్సరాలు పూర్తికాగానే యిక సంసారపంకానికి దూరంగా జరిగి, దివ్యత్వాన్ని సాధించే ప్రయత్నంలో పడాలి మనిషి. ఈ తనువును, మనస్సును, బుద్ధిని ప్రసాదించిన పరమాత్ముని మ్రోల వినమ్రులమై, మన శక్తులకు సమాజ పరమేశ్వర సేవకు అంకితం చేయాలని నిర్ణయించుకొని, ఆ రోజంతా ఆత్మ విచారణతో గడిపి, ఆ నిర్ణయం అమలుకు ఇంకెంత దూరంలో ఉన్నామో ఆలోచించుకోవటమే పుట్టినరోజు పరమార్థం" అని ప్రవచించారు గురుదేవులు.

తరువాత ఆశ్రమ బాలబాలికలు 'అప్పారావుగారి బాకీ' అనే ఒక చిన్న హాస్యనాటికను ప్రదర్శించారు. చి॥ సాయి తేజస్విని, చి॥ వాసు అందరిలో సహజంగా నటించి బహుమతులు సంపాదించుకున్నారు. చిన్న కోలాట ప్రదర్శన, కథాకథనం వగైరాలు ప్రదర్శించారు. భక్తులందరూ గురుదేవులకు నమస్కరించి ఆశీస్సులందుకొన్నారు.

ఇక చివరి కార్యక్రమం భోజనాలు. యథాప్రకారం మా అరవిందాక్షన్ నాయర్‌గారు అన్నదాతలుగా నిలిచి ఫ్రైడ్‌రైస్, మూడు కూరలు, సాంబారు, పచ్చడి, స్వీటు, పులిహోరలతో మృష్టాన్న భోజనాలు వడ్డించారు. మైక్ సిస్టమ్స్ మా చి॥ ప్రవీణ్ ఏర్పాటు చేయగా, పాల ఏర్పాట్లు పూర్వ విద్యార్థులు చి॥ హేమంత్‌రెడ్డి, అతని భార్య శ్రీమతి ఉజ్జ్వల చేసారు.

సాయంత్రం అందరూ వెళ్లిపోయాక - గురుదేవులు శుకవాణిని పిలిచి,

"మా అమ్మా నాన్నగార్ల పేర్లతో అంత అందంగా చమత్కారంగా చెప్పావు-చాలా బాగుంది. నాకెన్నడూ యీ ఊహే రాలేదు" అని సంతోషంతో చెప్పడం గురుదేవులు శుకవాణికిచ్చిన విశిష్టానుగ్రహంగా భావించి, ఆమె పొంగిపోయింది. అలా గురుజన్మదినోత్సవం పూర్తయింది.

మార్చి 14వ తేదీ వరకు ఆశ్రమ పాఠశాలలో ప్రీ ఫైనల్ పరీక్షల హడావుడి, 14 సాయంత్రం వాళ్లకు వీడ్కోలు చెప్పేందుకై ఫేర్‌వెల్ పార్టీ హడావుడి పూర్తయ్యాయి. మార్చి 17వ తేదీ రాత్రి ... రైలులో గురుదేవుల బృందం పాలకొల్లు దగ్గరి పెదపట్నంకు బయలుదేరింది. గతంలో అక్కడి సాయిదేవాలయానికి శంకుస్థాపన, విగ్రహప్రతిష్ఠ కూడా గురుదేవులే చేసి ఉన్నారు. ప్రథమ వార్షికోత్సవానికి కూడా తప్పక వారే రావాలని శ్రీ కె. కృష్ణారావుగారు పదేపదే కోరుకోవటంతో స్వామీజీ వెళ్లారు.

# అనుభవాలు-అనుభూతులూను-7

**- శుకవాణి**

మా నాన్నగారు మంచి పండితులు. పచ్చని పసిమి, నొక్కుల జుట్టు, విజ్ఞానపు కాంతి చిందే కళ్లతో ఉండేవారు. ఆయనకు నేనంటే ప్రాణం. రెండు కారణాలు దానికి. ఒకటి ప్రధానమైన కారణం-ఆయనకు చదువంటే చాలా మక్కువ. సాహిత్య విద్యాప్రవీణ చేసారు. ఇంకా ఎంతో చదవాలనీ, సాహితీపరంగా ఏవో ఎత్తులకు ఎక్కాలనీ, ప్రాచీన సాహిత్యపు లోతులన్నీ తడిమిచూడాలనీ ఎన్నో కోరికలుండేవి (వారి నోటివెంట విన్నదే యీ మాట.) 'వివాహం విద్యానాశాయ' అన్న సూక్తికి దొరక్కుండా ఉండాలని ఎంత ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. రైతు కుటుంబాలలో ఆనాటి ఆనవాయితీ ప్రకారం యింకా పట్టా కూడా చేతికి రాకుండానే పందొమ్మిదేళ్ల వయసులో-పదవ సంవత్సరం నడుస్తూన్న మేనమామ కూతురినిచ్చి పెళ్లి చేసేసారు. డిగ్రీతో చదువు ఆగిపోయింది. ఆయన విద్యాతృష్ణ తీరలేదు.



సాయి వాణి

మా అమ్మ ఆరో తరగతి వరకు చదువుకొన్నది. మంచి తెలివితేటలున్నాయి. నేల తల్లికున్నంత ఓర్పు, సమస్యను ఎదుటి వారి కోణం నుండీ చూడగల నేర్పు ఆమె సొంతం. కొంతవరకు సంగీతం నేర్చుకొన్నది పెళ్లి నాటికే. నాన్నగారు ఆమెకు చదువుచెప్పి పరీక్షలు వ్రాయించాలని ఉబలాటపడ్డారు. కానీ వీరి తీవ్ర కోపం చూచి ఆవిడ భయపడిపోయింది. ఇంటి విషయాల్లో ఎలాగూ తప్పవు. ఈ చదువు పేరిట యింకొన్ని తిట్లు దేనికిలే! అనుకొన్నది. అంచేత ఎంత చెప్పినా అర్థం చేసుకోలేని బండ దానిలాగా, ఎంత చదివినా కంఠస్థం చెయ్యలేని మొద్దులాగా విజయవంతంగా నటించి ఆ చదువు ప్రమాదం నుంచీ బయటపడింది(ట!-ఈ మాట నా పదిహేడవ ఏట-నా ఒక రచనలోని మంచిచెడులను ఆమె అత్యద్భుతంగా విశ్లేషించి చెప్పినపుడు నేను చకితురాలినై, 'ఇంత తెలివి గలదానివి-నాన్నారు చెప్తే ఎందుకు చదువుకోలేదు?' అని అడిగాను. అప్పుడామె దీనికి కారణం చెప్పింది.)

ఇంతకీ మా నాన్నగారికి తనకు తీరని విద్యాదాహాన్ని మరొకరికైనా తీర్చాలన్న కోరిక అమ్మ వలన తీరలేదు. తొలిబిడ్డ లిద్దరూ పురిటిలోనే పోయాక నేను దక్కాను. నాకు నాలుగేళ్లు వచ్చేవరకూ మౌఖిక బోధన-ఇప్పటి నర్సరీ ఎల్కేజీల్లాగా. ఇక నాలుగేళ్ల వయసులో నన్ను ఆయన శిష్యరికంలోకి తీసుకున్నారు-ఓంకారం వ్రాయించటంతో ప్రారంభించి. అంతదాకా అల్లారుముద్దుగా, అపురూపంగా పెంచి, 'ఇక కదలకుండా కూర్చో, దిద్దు' అంటే నేనెందుకు వింటాను? నెలరోజులైనా అ, ఆలు దాటిన పాపానపోలేదు. నాన్నగారు నెలనెలా చందమామ కొనేవారు అప్పటికే. అమ్మా, ఆయనా చందమామ చదువుకొని ఏమేమిటో చెప్పుకోవటం, నవ్వుకోవటం, ఏమిటని అడిగితే 'మేం చెప్పం, నువ్వే చదువుకో' అనటం.... ఐదారుసార్లు అలా జరిగాక "నాకు చదవటం రాదుగా!" అన్నాను. ఇదుగో యిది చం-ద-మా-మ. ఇవి వ్రాసుకో ముందు. రోజూ అలా కొన్ని అక్షరాలు వ్రాస్తే చదవగలవు' అని వివరించారు. ఒక పుల్ల తీసుకొని 'చ' మీద ఐదారు సార్లు దిద్దించారు. అటుపైన బలపంతో ఆ (కాగితం మీది 'చ'నే)

రెండుసార్లు దిద్దించారు. 'ఇప్పుడు నువ్వు వ్రాయి' అన్నారు. నేను కొద్దిగా శ్రమపడి వ్రాసాను. అదే పద్ధతిలో మిగిలినవీ వ్రాసి ఓ పావుగంటలో నా అంతట నేను 'చందమామ' అని వ్రాసాను. ఇక ఎక్కడా ఆగలేదు బండి. నల్లేరు మీద నడిచినట్లే నడిచింది. ఏడాది తిరిగేటప్పటికి ఎంత క్లిష్టమైన వాక్యాలైనా నిర్దుష్టంగా భావయుక్తంగా, స్పష్టంగా చదవటం అలవాటై పోయింది. అప్పటికి నాకు అయిదేళ్లు నిండాయి. ఇవన్నీ మా అమ్మ చెప్పినవే నాకు. కాకుంటే ఆ వయసులో జరిగినవన్నీ ఏం గుర్తుంటాయి! అప్పట్లో పుస్తకాలు తప్ప ఇతర ఆకర్షణలేవీ సమాజంలో లేకపోవటం, ఇంట్లో చదువుకొన్న మనుష్యులు, పుస్తకాలు, వార్తాపత్రికలు ఉండటం-వీటివలన ఆ రోజులలో చిన్న పిల్లలప్పటినుంచే చదివే అలవాటు కావటం విశేషమేమీ కాదు. కాకపోతే నేను మరీ చిన్నదాన్ని-అంతే.

అప్పట్లో ఆడపిల్లలు తిన్నగా ఎనిమిదవ తరగతిలోనే బడిలో చేరడానికి అవకాశం ఉండేది. అంచేత నాన్నగారు స్వయంగా చదువుచెప్పి, అలా పంపాలనుకొన్నారు. ఆయన ప్రాథమికంగా సంస్కృత పండితులు. మంచి బేడ్మింటన్ ప్లేయర్ కావటంచేత (బాపట్లలో ఉద్యోగం నాన్నగారికి) కోటేశ్వర్రావుగారనే ప్లీడరుగారితో స్నేహం ఏర్పడింది. వీరు వారికి సంస్కృతం చెప్పటం, వారు వీరికి ఆంగ్లం బోధించటం. అటుపైన మరో లెక్కల మేష్టారి దగ్గర లెక్కలు అభ్యసించటం, సైన్సు పుస్తకాలు స్వయంగా చదువుకోవటం, సాంఘిక శాస్త్రం మీద అనేక గ్రంథాలు చూడడం-నాకు ఆరేళ్లు దాటేటప్పటికే నాన్నగారు ఒక సమగ్ర ఉపాధ్యాయుని స్థాయికి వచ్చేసారు. ఇక నా పని చూడండి!

బాల్యంలో ఆడినవీ, పాడినవీ, స్నేహితులూ ఏవీ నాకిప్పుడు గుర్తులేవు. కారణం-వాటి ముద్ర నామీద పడేంతగా అవిలేవు కాబట్టి. మరిఎక్కువ భాగం చదువులోనే గడవటం. ఆ వయసులో చందమామతో ప్రారంభ మైన చదువు తొమ్మిదేళ్లు వచ్చేసరికి కంటికి కనిపించిన కాగితమల్లా నమిలేసేంతగా ఎదిగింది. తొమ్మిదేళ్లు నిండుతూండగా శరత్‌బాబు సాహిత్యం దాదాపుగా మొత్తం-చరిత్రహీనులు, శేషప్రశ్నతో సహా





చదివెయ్యడం బాగా గుర్తు. అర్థం అయిందేదో అయ్యేది-లేనిది లేదు. చదవడం-అంతే. అయితే యివన్నీ నాన్నగారు లేనప్పడే, ఆయన చూడకుండానే. ఆయనకు నన్నో పెద్ద మేధోనిధిని చెయ్యాలని ఉండేది. తనకు ఎనభై ఏళ్ళు నిండి కళ్లు బాగా దెబ్బతినేంతవరకూ ఆయన చేతిలో పుస్తకం లేని క్షణం ఉండేది కాదు. చివరికి భోజనం చేస్తూ కూడా. నేను కూడా అంత దీక్షతో చదవాలని ఆయనకుండేది. దానికి నా బాల్య చాపలం ఎదురుతిరుగుతుండేది అప్పుడప్పుడు. ఆయన పోగొట్టుకున్న అవకాశాన్ని, తనకు తీరని విద్యాదాహాన్ని నా ద్వారా తీర్చుకోవాలను కొంటున్నారన్న అవగాహన నాకెలా కలుగుతుంది? అంచేత ఆయన నా ఆనందాన్ని కొల్లగొడుతున్న రాక్షసునిలా కన్పించేవారేమో! కానీ, ఎక్కడో చాలా గౌరవం, అభిమానం ఉండేవి.

లెక్కలు చేస్తున్నాం ఓసారి. ఒక లెక్క ఎంత ప్రయత్నించినా ఆన్సరు రాలేదు. రెండు, మూడు రకాలుగా ప్రయత్నించాము. చివరికి నాన్నగారు- "తొమ్మిదిన్నరైందమ్మా! ఇక పడుకో. ప్రొద్దున చూద్దాంలే" అన్నారు. పుస్తకాలు సర్దేసాను. అర్థరాత్రి దాటి ఉంటుంది-నాన్నగారు నన్ను తట్టిలేపారు- "లేమ్మా, లే! లెక్కల పుస్తకం తీసుకురా" అని. నేను నిద్ర కళ్లతోనే లేచి యిచ్చాను. నాన్నగారు చకచక లెక్కచేసి చూపించారు. ఆన్సరు వచ్చింది. ఇంతకు ముందు ఎక్కడ తప్పామో వివరించారు. 'ఇక పడుకో' అన్నారు. అలా మరోసారి కూడా జరిగింది. ఇంగ్లీషు గ్రామరు నేర్పడానికి మొదట జె.వి. రమణయ్య గ్రామరు పుస్తకంతో ప్రారంభించి రెన్ అండ్ మార్టిన్‌లోకి దింపారు. దానికి 'కీ' కూడా కొన్నారు. ఒక్కో అభ్యాసం చెయ్యటం-సరి చూచుకోవటం-ఎక్కడ, ఎందుకు తప్పిందో తెలుసుకోవటం-యిదంతా ఓ యజ్ఞం. అటుపైన కాలేజీ స్థాయిలో బేటిల్ అండ్ బెనర్జీ ఎవ్వరూ చెప్పనక్కర్లేకుండానే అర్థమైంది.

ఒక పాఠంలో కొన్ని పద్యాలుంటాయి. అవి ఫలానా గ్రంథంలోవి. ఆకాసిన్ని పద్యాలూ కాదు-మొత్తం గ్రంథమే తెస్తారు. సారాంశం చెప్తారు. పీఠిక చదివిస్తారు. గ్రంథం అక్కడక్కడా చదివిస్తారు. అప్పటికి ఆ కవి

పట్ల, కావ్యం పట్ల ఒక అవగాహన కలుగుతుంది. అభిరుచి కలుగుతుంది. ఇక ఆ పాఠం మర్చిపోవడమంటూ జరగదు. నాన్నగారు అలవాటు చేసిన యీ పద్ధతిలోనే భాషాప్రవీణ కూడా చదివాను. ఆంగ్ల నవలలు (పిల్లల నవలలు (హకల్‌బెరీఫిన్, ట్రెజర్ ఐలండ్ వంటివి, ఠాగూర్, కుష్వంత్‌సింగ్, ఆర్కే నారాయణ్, కిషన్‌చందర్, ముల్క్‌రాజ్ ఆనంద్ వంటి ఇండియన్ ఇంగ్లీషు రచయితలు, పుస్తకాలు హైస్కూలులోనే చదవటం అలవాటైంది. ఐతే ఇదంతా అలవోకగా జరిగిందా? లేదు. ఒక్కోసారి బాగా చివాట్లు తినవలసి వచ్చేది. దెబ్బలు కూడా పడేవి.

తినడానికి ఏవేవో తెచ్చి యిచ్చేవారు. ఒకటి, రెండుసార్లు అమ్మ కోప్ప డింది-"ఆడపిల్లలు బయటి తిళ్లకు అలవాటైతే కొంప కొల్లేరు చేస్తారు రేపు" అని. అందుచేత నాన్నగారో ఉపాయం కనిపెట్టారు. నాన్నగారి గదిలో పెద్ద పందిరి మంచం ఉండేది. ఆ మంచం నాకే వదిలేసారు నాన్నగారు. మధ్యాహ్నం భోజనానికి స్కూలు నుంచీ యింటికి వచ్చేవాళ్లం యిద్దరం. నేను అన్నం తినేదాన్ని. నాన్నగారికేదైనా ఫలహారం పెట్టేది అమ్మ. ఆయన అందులో దాదాపు సగం మిగిల్చి ఓ గాజుగిన్నెలో పెట్టి (ఈ గాజు గిన్నె పందిరి మంచ తల పెట్టెలో ఉండేది) కిటికీలో ఉంచేవారు. "సాయంత్రం బడిలోంచీ వచ్చాక కిటికీలో ఉన్న పకోడీలు (మరోటేదో) తినెయ్యి. మీ అమ్మను చూడనివ్వకు" అనేవారు. నేను ఎంచక్కా తినేసి అమ్మకు చెప్పేదాన్ని. ఆవిడ నవ్వి "నువ్వంటే ఆయనకంత ప్రాణం. చూడు మగపిల్ల వాడికైనా పెట్టరు. నీకే పెట్టాలనుకొంటారు. నిన్ను 'నాన్నా, తల్లీ' అని తప్ప ఒసే అసే అని పిలవరు. అంత ప్రేమ చూపించే నాన్నగారు ఎలా చెప్తే అలా వినాలి-అలా చదువుకోవాలి" అని చెప్పేది. అయినా ఒక్కోసారి తోక జాడించేదాన్ని బాల్య చాపలంతో. ఇంటి ఎదురుగా నెట్ కట్టి బాల్ బేడ్మింటను, ఇంట్లో కేరమ్స్ నేర్పేవారు. కానీ, ఎప్పుడయినా కొట్టే వరస వస్తే మాత్రం బాగా పడేవి.

ఒకసారి అలాగే చాలా దెబ్బలు తిన్నాను. ఏడ్చిఏడ్చి పడుకున్నాను. ఒళ్లంతా బెత్తం దెబ్బలు. అమ్మ కళ్లనీళ్లు తుడుచుకొంటూ కొబ్బరినూనె





రాసింది. కాస్త పెరుగన్నం, చక్రకేళీ పండు కలిపి తినిపించి 'నిద్రపో' అని సైగ చేసి వెళ్లిపోయింది. నాకు నిద్రపట్టడం లేదు. అసలాయన నన్నెందు కొట్టాలి? నేనంటే ఆయనకెందుకు కోపం? తమ్ముడిని కొట్టరేం? (వాడికప్పటికి నాలుగున్నరేళ్లే, నాకు పదిన్నర.) ఛీఛీ అమ్మకూడా అడ్డం రాలేదు! ఉక్రోషంతో, బాధతో కళ్లు మూసుకొనే ఆలోచిస్తున్నాను. గడియారం పది కొట్టింది. ఎవరో వచ్చి మంచం మీద కూర్చున్నారు. అమ్మనుకొన్నాను. మెల్లగా దుప్పటి తీసి నా చేతుల మీద, కాళ్ల మీద ఉన్న దెబ్బల మీద మృదువుగా రాస్తున్నారు. అది అమ్మ చెయ్యి కాదు. నాకు తెలిసిపోయింది-అది నాన్నగారి చెయ్యి. మెల్లగా, దయగా తల నిమిరారు. "నేనో వెధవని, వెర్రి కోపంతో కొట్టాను-పిచ్చితల్లిని" నాన్నగారి కంఠం బొంగురుగా, దుఃఖంగా వినిపిస్తోంది. అమ్మ కంఠం "మీరు దాని మేలుకోరే వారేగానీ శత్రువులు కారుగా! రెండు దెబ్బలు ఎక్కువ పడ్డాయి అంతేలే-బాధపడకండి" అని ఓదారుస్తున్నది. నా నుదుటిమీద రెండు కన్నీటి చుక్కలు టప్పన పడ్డాయి. "ఛ! ఏమిటండీ అది! మీరు కన్నీళ్లు పెట్టుకోవటం ఏమిటి? లేవండి అక్కడ" అన్నది అమ్మ. "ఇది చాలా గొప్పది కావాలి. మంచి పండితురాలు కావాలి. అందుకే చదవకపోతే నేను భరించలేను" నాన్నగారు రుద్ధకంఠంతో అన్నారు. మరోసారి నా ఒళ్లు నిమిరి, నిట్టూర్చి మరీ లేచారు. అమ్మయ్య! అప్పటికి నా మనసు చల్లబడింది. నాన్నగారికి నేనంటే కోపం లేదు. ప్రశాంతమైన మనసుతో నిద్రపోయాను. మర్నాడు నాన్నగారు చెప్పినదంతా శ్రద్ధగా విని వ్రాసాను.

నాన్నగారి పట్ల నాకు ప్రేమ, గౌరవం ఉన్నాగానీ భయమే ఎక్కువగా ఉండేది. ఆయన అమృత హృదయం ఆ వయసులో తెలియలేదు. ఆయన ఎందరో పిల్లలకు ఫీజులు కట్టేవారు. పెళ్లిళ్లకు, కష్టాలకు సాయం చేసేవారు. ధనం మూట కట్టాలన్న తపన లేదు. మాకేవో నగలు చేయించాలి, ఇళ్లు కట్టాలి-యివేవీ లేవు. అందరినీ జ్ఞానవంతులను చేయాలి, పది మందికి సాయపడాలి- ఇదే ఆయన లక్ష్యం. ఖచ్చితంగా సత్యమే చెప్పేవారు. కాకపోతే కాస్త కోపం ఎక్కువ.

చాలా ఏళ్ల తరువాత శంకరాభరణం సినిమా చూచాను. అందులోని సంగీత విద్వాంసుడికి ఒక్కటే కూతురు. మాతృహీన. స్వయంగా సంగీతం నేర్పుకొంటారు కూతురికి. ఆ పిల్ల ఎప్పుడో ఓసారి పెళ్లిచూపులలో చక్కని కీర్తన పాడుతూ అపస్వరం పలుకుతుంది. విద్య లోతులెరిగిన ఆ పండితుడు కూతురిని లాగి చెంప మీద కొడతాడు. కొట్టానే అన్న బాధతో కొట్టిన అరచేతిలో కర్పూరం వెలిగించి దేవు(డికి హారతిస్తాడు. ఇది చూచిన కూతురు నిద్రబోతున్న తండ్రి దగ్గర కూర్చొని ఆ గాయానికి నవనీతం రాస్తూ, కీర్తన సరిగా పాడుతుంది. తండ్రి బిడ్డను గుండెకు హత్తుకుంటాడు. ఈ ఆర్తే ఆనాడు నాన్నారిలో కలిగి ఉంటుంది గదా! నాన్న గారి స్మృతితో నా చెంపలు తడిసిపోయాయి-ఆ దృశ్యం చూస్తుంటే.

అందులోనే మరోచోట-ఆ మహావిద్వాంసుడు నిద్రపోతుంటాడు. శిష్యుడు-పదేళ్లవాడు-కాళ్లు నొక్కుతూ 'మానస సంచరరే' కీర్తన సాధన చేస్తుంటాడు. మధ్యలో ఆగిపోతుందది. తంటాలు పడుతుంటాడు కుర్రవాడు. గాఢనిద్రలోనే గురువు అక్కడినుండీ మిగిలిన పాట అందుకొని పూర్తిచేస్తాడు-ఇంకా నిద్రపోతూనే. ఈ దృశ్యం చూడగానే నాకు దుఃఖం ముంచుకువచ్చింది. నిద్రలో కూడా ఆన్సరు రాని లెక్క నాన్నగారి మనసులో మెదులుతూండటం చేతనేగదా ఆయన హఠాత్తుగా లేచి లెక్కచేసి చూపించారు! నాకోసం ఆయన ఎంత తపించారు! అంతటి పుణ్యపురుషుడిని, ప్రేమమూర్తిని తండ్రిగా పొందిన నేనెంత భాగ్యశాలిని! 'అప్పుడు పూర్తిగా గ్రహించలేకపోయానే!' ఆయన కోపం వెనుక ప్రేమను, ఆర్తిని చూడలేకపోతినే! అని వ్యథ చెందాను. నా కోసం సమాజాన్ని ఎదిరించి పై చదువులు చదివించారు. నా కోసం ఎన్నో నేర్చుకున్నారు. రాజకీయోపన్యాసాల నుంచీ, సాహిత్యోపన్యాసాల వరకు నన్ను తీసుకునే వెళ్లారు. మహా నాయకుల చరిత్రలు చదివించారు. నా వ్యక్తిత్వాన్ని తీర్చి దిద్దేందుకై ఎంతోకాలం వెచ్చించారు. వారి స్మృతికి ఇప్పటికీ గర్వంతో నా మనసు ఉప్పొంగుతుంది. కనులు చెమర్చుతాయి.





స్వరాంజలి

# భలే మంచి దొర దొరికె

**సేకరణ : మాతాజీ**

(ఒకనాటి సాయంత్రం రేడియోలో విన్నానిది. పల్లవి వినగానే ముచ్చటగా తోచి వ్రాసిపెట్టాను, రేడియో వెనక్కు తగ్గి, టి.వి. దూసుకొచ్చాక-యిటువంటి రసమయమైన జానపద గీతాలు వెలుగుచూడటం తగ్గిపోయింది. పైగా దృష్టి బొమ్మ మీదుంటే భావం రసం మీద ఏకాగ్రంగా నిలవదు కూడా. నిందాస్తుతితో నిండిన యీ పాట ఏ మహానుభావుని నోట పలికిందో తెలియదుగానీ పదుగురూ ఆనందించదగినదీ-అనుకోదగినదీ అని అందిస్తున్నాను - కొద్దిమార్పులతో.

– *ప్రధాన సంపాదకురాలు*)

ఏమి కొలువోరిది ఎంకన్నా!
భలె మంచి దొర దొరికె బసవన్నా...... ॥ఏ ॥
కొప్పలో మున్నీరు నుదుట మూడో కన్ను
గొంతులో గరళమూ కుక్షిలో ముల్లోకాలు ॥ అబ్బబ్బఅబ్బా॥ఏ॥
సిగలో చందమామ - నగ కోడెనాగు
పులితోలు మొలపాత - బూడిదా గంధమ్ము ॥ఏ॥
వీటివానీ ఢమరు - వేటగానీ బరిసె
కొండకొమ్మూ విల్లు - కోయ దొర వేషం ॥అరెరెరెరే ॥ఏ॥
పునుక బిచ్చపు గిన్నె - తిరిపాల తిండీ
కాటి కాపురమ్మూ-దెయ్యాలసేనా ॥అయ్యయ్యొఅయ్యో॥ఏ॥
కడలి తీరాననో-కారడవిలోనో
చలికొండ గుహలోనో-చేర నిలకడలేదు ॥రామరామరామ
నారాయణా॥ఏ॥
సగదేహమిల్లాలు-వింత లింగపు రూపు
శివమెత్తి తాండవం-కడుచల్లన్నిచూపు॥ఓహోహో ఓహ్హోహో॥
ఏమి కొలువోరిది ఎంకన్నా!
భలె మంచి దొర దొరికె బసవన్నా...... ॥ఏ ॥

# దేవుడితో కాస్సేపు

**- ద విజన్ సౌజన్యంతో**

ఓ చిన్నబ్బాయికి దేవు(డిని చూడాలని కోరిక కలిగింది. ఎంత దూరం, ఎన్నాళ్లు తిరిగి వెదకాలో అనుకొని రెండు జతల బట్టలు, కొన్ని మిఠాయిలు తీసుకొని ప్రయాణమయ్యాడు. వెడుతూ వెడుతూ దారిలో ఒక పార్కులోకి వెళ్లి బల్లమీద కూర్చున్నాడు'. అలసిపోయి ఉన్నాడేమో-ఒక మిఠాయి ఉండ తీసుకొని తినబోయాడు. అప్పుడతని కళ్లకు ఒక వృద్ధుడు కన్పించాడు. వీడు తన చేతిలోని మిఠాయి తాతకిచ్చి, తాను వేరేది తీసుకున్నాడు. ముసలాయన తిని, చల్లగా నవ్వాడు. ఆయన నవ్వు చాలా అందంగా, అద్భుతంగా ఉంది. కుర్రాడికి ఆ నవ్వు చాలా నచ్చింది. ఇంకాస్సేపాగి మరికాస్త మిఠాయి తీసి ఆయనకొక ముక్క ఇచ్చి, తానొక ముక్క తిన్నాడు. మళ్లీ అదే నవ్వు ఆయన ముఖంలో. అబ్బాయికి ఆ నవ్వు మళ్లీ మళ్లీ చూడాలనిపించింది. అక్కడే ఆ చెట్టుక్రిందే కాస్సేపు పడుకొని లేచాడు. ముసలాయన అక్కడే ఉన్నాడు. అబ్బాయి మళ్లీ తాను కొంచెం మిఠాయి తీసుకొని ఆయనకు కొంచెం యిచ్చాడు. ఆ మధురమైన నవ్వు మళ్లీ చూచాడు. ఇద్దరూ పెదవి విప్పి మాట్లాడుకోనే లేదు. మరికాస్సే పయ్యాక పిల్లవాడు లేచి యింటికి బయలుదేరాడు. పది అడుగులు వేసి వెనక్కు పరుగెత్తుకు వచ్చి ఆయన వీపు మీద వాలి చుట్టూ చేతులు వేసాడు. ఆయన అదే చిరునవ్వుతో వాడి బుగ్గ మీద ముద్దు పెట్టుకున్నాడు.

అబ్బాయి హుషారుగా యింటికి వచ్చాడు. వాళ్లమ్మ వాడి ఉత్సాహం, వాడి కళ్లల్లో తళతళ చూచి ఆశ్చర్యపోయింది. 'ఏమిటిరా-అంత సంతోషంగా ఉన్నావు?' అని అడిగింది ముద్దుగా. 'నేను దేవు(డితో కలిసి భోంచేసానమ్మా!' అన్నాడు వాడు. పైగా దేవు(డి నవ్వు ఎంత బావుందో! చల్లగా .... హాయిగా" అన్నాడు.

వృద్ధుడు తన ఇంటికి వెళ్లాడు. ఆయన కళ్లలోని ప్రశాంతతనీ, ఆనందాన్నీ చూచాడు ఆయన కొడుకు. "ఏమిటి నాన్నా! అంత ఆనందంగా





ఉన్నావు, ఏం జరిగింది?" అన్నాడు. ఆయన వెంటనే 'నేను దేవు(డితో కలిసి మిఠాయి తిన్నానురా పార్కులో. నేను అనుకొన్న దానికన్నా చాలా చిన్నవాడు దేవు(డు' అన్నాడు ఆయన. ఆప్తతతో కలిసిన ఓ చిన్న చిరునవ్వు, ఓ ప్రేమపూర్వకమైన స్పర్శ, స్వచ్ఛమైన మనసుతో చేసే ఓ మెచ్చుకోలు, అభిమానం చూపే ఓ చిన్నపని-మన జీవితాలలో దివ్యత్వాన్ని ప్రవేశపెట్ట గలవు. దేవు(ని దగ్గరకు చేరటం ఇంత తేలిక-అని మనం ఎప్పుడు గ్రహిస్తామో గదా!



# ఆశీరక్షతలు



శ్రీమతి గంగమ్మ, నల్ల బాల్‌రెడ్డి గార్ల ప్రథమ పుత్రుడు చి॥ హరి కాంతరెడ్డి హైస్కూలు విద్య మొత్తం శ్రీ సాయి విద్యాధామం ఉన్నత పాఠశాలలోనే నడిచింది. తదుపరి ఉన్నత విద్యనభ్యసించి ఎదిగిన చి॥ హరికాంత్ వివాహం ఫిబ్రవరి 22వ తేదీ రాత్రి చి॥సౌ॥ హారికతో తూముకుంట గ్రామంలోని ఎం.ఆర్.కె. గార్డెన్స్‌లో శాస్త్రోక్తంగా జరిగింది.

అలాగే చి॥ భూక్య గణేశ్ నాయక్ (శ్రీమతి భూలి, నరసింహ నాయక్‌ల పుత్రుడు) కూడా సాయి విద్యాధామం విద్యార్థి. అతని వివాహం ఫిబ్రవరి 27వ తేదీ తెల్లవారుజామున గం.4.01ని.లకు పెద్ద తండా గ్రామం (వరంగల్ జిల్లా)లో శాస్త్రోక్తరీతిన జరిగింది.

పై రెండు జంటలలోని వధూవరులు పరస్పరం చక్కని అవగాహనతో కలకాలం చల్లగా జీవించి, సత్సంతానవంతులై, తమ బిడ్డలను దేశ భక్తులుగా లోకోపకారులుగా తీర్చిదిద్ది కుటుంబ ఋణం, సమాజ ఋణం తీర్చుకోవాలని సాయివాణి ఆశీర్వదిస్తున్నది. తథాస్తు!

# మిగిలిన కాస్త సమయం

ఉక్కు మనిషిగా పేరందిన మహాత్యాగి, పరమ దేశ భక్తుడు, అలుపెరుగని వీరయోధుడు శ్రీ సర్దార్ వల్లభాయ్ పటేల్ 1875వ సంవత్సరం అక్టోబర్ 31వ తేదీన జన్మించారు. స్వాతంత్ర్య పోరాటంలోగానీ, తదుపరి స్వతంత్ర భారతంలో స్వదేశ సంస్థానాల విలీనంలోగానీ, ముఖ్యంగా తెలంగాణాను నిజాం నంఉడీ విముక్తం చెయ్యటంలోగానీ ఆయన పాత్ర నిరుపమానమైనది. తొలి ప్రధానమంత్రిగా తనకున్న అవకాశాలను స్వచ్ఛందంగా దేశ సమైక్యత కోసం ధారపోసిన త్యాగమూర్తి పటేల్. తన 75వ ఏట తన అభిమానులు, మిత్రుల ముందు ఆయన అన్న మాటలు చదవండి.

"ఇప్పుడు నేను జీవితంలో విశ్రాంతి తీసుకునే హక్కున్న వయసుకు చేరుకున్నాను. కానీ, నా మనసు, ఈనాడున్న సంక్లిష్ట పరిస్థితులలో నా దేశానికి సేవ చేసేందుకు తహతహలాడుతున్నది. నా దేశం సుస్థిరంగా, బలంగా, సమగ్రాభివృద్ధి గల నిర్భీక దేశంగా నిలబడాలని నాలోని ప్రతి రక్తకణమూ తపిస్తున్నది. ఈ మిగిలిన కాస్త జీవితాన్నీ కూడా ఆ లక్ష్య సిద్ధికే అంకితం చేయాలని కోరుకొంటున్నాను".

# నాలుగు మెట్లు

– మాతాజీ

మనం ప్రపంచంలో ఎందరో బోధకులను, గురువులను చూస్తుంటాం అన్ని మతాలలోనూ. టి.వి.లలో, రేడియోలలో, ఆధ్యాత్మిక వేదికలపైనా అద్భుతంగా, అనర్గళంగా ఉపన్యాసాలు, ప్రవచనాలు ఇచ్చే పండితులను, వేదాంతులను కూడా చూస్తుంటాం, వింటుంటాం. శ్రద్ధగా అవన్నీ విన్న వారిని మనం కదిలించి 'వారేమి చెప్పారండీ?' అని అడిగితే వెంటనే వచ్చే జవాబు 'చాలా బాగా చెప్పారండీ!' అని. మళ్లీ అడిగితే 'అన్ని పాయింట్లూ చెప్పలేంగానీ చాలా బాగా చెప్పారండీ!' అంటారు. మొత్తం





మీద ఎక్కువమంది ఉపన్యాసకుల వాగ్వైఖరి, శబ్దఝరి, నైపుణ్యం జనాలను ఆకర్షిస్తున్నాయి గానీ - శ్రోతల హృదయాల మీద ముద్ర వెయ్యలేకపోతున్నాయన్న మాట. ఎందుకని?

జ్ఞానం పొందడానికీ, పంచడానికీ నాలుగుమెట్లు ఎక్కవలసి ఉంది. వాటిలో మొదటిది అధీతి-అంటే అధ్యయనం. మన పూర్వ ఋషులు జ్ఞానులు ఎంతో తపస్సు పరిశోధనలు చేసిచేసి మానవుడు ముక్తి పొందడానికి మార్గాలు కనుగొన్నారు. వాటిని గ్రంథరూపంలో (ఉపనిషత్, గీత, శాస్త్రాదులలో) నిక్షిప్తం చేసారు. వాటిని అధ్యయనం చెయ్యాలి. అంతేకాదు మహనీయుల జీవనరీతులను కూడా సమగ్రంగా అధ్యయనం చెయ్యాలి. తమ జీవితానికి ఆయారీతులు ఏ విధంగా అన్వయించుకోవాలో తెలుసుకోవాలి. శ్రీ రామకృష్ణ, రమణ మహర్షి మున్నగు ఆధునిక ఆధ్యాత్మవేత్తల గ్రంథాలను కూడా సవిమర్శకంగా పఠించాలి. నిజానికి అవలోకనం (తరచి తరచి తెలుసుకోవటం) చెయ్యాలి.

రెండవది బోధ. అనగా గురువుల దగ్గర, వేత్తల చెంతను, భగవత్ ప్రసన్నత పొందిన వారి చెంతనూ కూర్చుని వారి బోధలు ఆలకించాలి. శ్రవణం-పదేపదే వినడం, మననం (విన్న దానిని పదేపదే మనస్సులో మథించుకోవడం, నిధిధ్యాసనం (మననం చేసిన సారాన్ని మనస్సులో నిలుపుకోవడం) మొదలైన వాటి ద్వారా తాము విన్న వాటిపైన పట్టు సాధించాలి. ఆ బోధ, అధ్యయనం చేసిన విషయాలు కూడా-నిద్రలో లేపి ప్రశ్నించినా చెప్పగలిగేటంతగా హృదయ గతమే కాదు. కంఠ గతం కూడా కావాలి. చాలామంది పండితులు ఇక్కడ ఆగిపోతారు. తాము విన్న వాటికి తమవైనశైలీ సౌందర్యాలను, చెణుకులను, వాక్ప్రవాహాన్నీ కలిపి ఇతరులకు బోధించటం, తద్వారా లభించే కీర్తినో, సంపత్తినో, ఆత్మ సంతృప్తినో మూటకట్టుకొని "ఇక చాలు" అనుకుంటారు. కానీ అసలైన మెట్లు ఆ తరువాతే ఉన్నాయి.

మూడవది ఆచరణ. తాము చదివిన, విన్న విషయాలన్నిటిని ఒక్కొక్కటిగా ఆచరణలోకి తెచ్చుకోవాలి. అలా ఆచరించటంలోగల సాధక బాధకాలు గ్రహణలోకి తెచ్చుకోవాలి. ఏ రకం వ్యక్తికి ఏది ఆచరణసాధ్యమో బోధకుడికి అప్పుడు అర్థం అవుతుంది. "ఇదే మార్గం" అన్న మొండి బోధ కాక-కృష్ణ పరమాత్ముడి లాగా నాలుగు రకాల మార్గాలలోను ఎలా నడవవచ్చో తెలుసుకోగలడు. ఈ ఆచరణే గొప్ప సాధన. ప్రతి క్షణం నేను ఇలా ఉన్నానా? నేను ఇది చేస్తున్నానా? ఈ బోధ నేను చెయ్యటానికి అర్హుడినేనా? అనే ప్రశ్నలు క్షణక్షణం మనస్సులో మెదులుతూ వ్యక్తిని జ్ఞాన పరిపుష్టుడిని చేస్తాయి. అప్పటికిగానీ అతని ఆధ్యాత్మ శక్తికి ఒక నిలకడ ఏర్పడదు.

ఇక నాల్గవది ప్రచారం. పై మూడు మెట్లు దాటాక ప్రచారంలోకి దిగాలి. తాను చెప్పే ప్రతి మాటా తాను ఆచరించి చూచినవాడే కనుక ఆచితూచి మాట్లాడతాడు. వినేవారు మూర్ఖులనో, అమాయకులనో తేలిక భావంతో లేదా అహంకారంతో చెప్పడు. మనిషి జ్ఞానస్వరూపుడేననీ, ఏదో కారణాన మాయలోపడ్డాడనీ, తాను ముందు తేరుకున్నాడు కనుక వారికి సాయపడుతున్నాననీ-ఒక సానుభూతితో, ప్రేమతో బోధిస్తాడు. "ఎంత చెప్పినా వినరేం?" అన్న కోపంతోగాక, "అయ్యో ఇంకా వినకపోతే ఎలాగయ్యా?" అన్న ఆవేదనతో చెప్తాడు. తనకు వినేవారంతా ఒదిగి ఉండాలనో, శిష్యులై సేవించాలనో కోరుకోడు. వారు బాగుపడితే చాలునన్న మాతృభావన అతనిలో నిండి ఉంటుంది. అటువంటివారు చేసిన ధర్మప్రచారం ఎదుటివారి ఎదలోతులలోకి దూసుకొనిపోయి, అంతరాంతరాలలో దాగి ఉన్న కాలుష్యాలను తొలగించివేస్తుంది. పరస్పర ప్రేమ భావనను పెంచుతుంది. సమైక్యభావాన్ని పోషిస్తుంది. సంస్కృతీ సంప్రదాయాలను దేశాభిమానాన్ని పరిరక్షిస్తుంది. ముందుగా స్నానం చేసిన తల్లి తన బిడ్డకు స్నానం చేయించే విధంగా ఉంటుంది ఆయన బోధ. ధర్మబోధ చెయ్యదలచినవారు పై మూడు మెట్లూ దాటాకనే ప్రారంభించాలి.





# గురు జన్మదిన దక్షిణ

– పుట్టగుంట సాయిరమణ

మా గురుదేవుల పుట్టినరోజు
మాకందరికీ పండుగ రోజు.
విజయనగర సృష్టికి విద్యారణ్యునిలా,
శివాజీకి సమర్థ రామదాస స్వామిలా
శ్రీరామునికి విశ్వామిత్రునిలా
మాకు మీరు స్వామీ!
ఓ స్మిత పూర్వభాషీ!
మీ చల్లని చూపులు మా బ్రతుకులకు
వేకువ మేలు కొలుపులు.
మీ కాషాయ ధారణ - మాలోని కల్మష నివారణ.
మీ దివ్య చరణాలు - మా సంకట హరణాలు.
ధర్మాన్ని నిలుపుకోవాలనే మీ తపన,
దేశాన్ని రక్షించుకోవాలనే మీ తాపత్రయం
కావాలి మాకు జీవితాశయం.
మా పరమ గురువులు మాణిక్యరాయ శర్మగారు
లోకానికందించిన
వెలలేని మాణిక్యం మీరు.
మా చీకటి జీవితాలకు వెలుగు వాకిళ్లు
తెరిచిన ప్రభాకరులు మీరు
స్వామీ, మీకివే నా వినయపూర్వక శుభాకాంక్షలు.
మా తప్పలను గమనించి, హెచ్చరించి
మమ్మల్ని మార్చండి స్వామీ!
మీ చల్లని నీడలో మాకింత చోటిచ్చారు-
మీ కరుణకై వేచి ఉండే చరణ ధూళిరేణువును -
దీవించి తరింపజేయండి యీ అజ్ఞానిని.